VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 286
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
మంగళవారం 31 మార్చి 2026

# రాష్ట్రంలో గృహ ప్రవేశాల పండుగ

- 2,50,893 ఇళ్లు లబ్దిదారులకు అప్పగింత
- ఈ ఏడాది డిసెంబర్‌లోపు మరో 4.5 లక్షల ఇళ్లు
- సంక్షేమంలో మర్చిపోలేని మాసంగా మార్చి
- విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టలేదు
- మన జలాల్లోకి పొరుగు రాష్ట్రాల జాలర్లు రాకుండా కట్టడి
- తిరుపతి జిల్లా నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- లబ్దిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి








**నాయుడుపేట,కలంకౌంటర్ :** ఈ ఏడాది చివరి నాటికి మరో 4.5 లక్షల గృహాలను పేదవారికి నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరు మాసాల్లో గృహ ప్రవేశాలు చేసేలా లబ్దిదారులకు ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ఇప్పటి వరకూ 5.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని వివరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30కి పైగా చోట్ల నిర్మించిన 2,50,983 టిడ్కో, పీఎంఏవై ఇళ్లను లబ్దిదారులకు అప్పగించారు. తాను హాజరైన ఒక్క తిరుపతి జిల్లాలోనే 15,659 ఇళ్లను నిర్మించి ఇచ్చామని సీఎం వివరించారు. నాయుడుపేటలోని పుదూరు వద్ద జీ ప్లస్ 3 తరహాలో నిర్మించిన భవన సముదాయాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పార్కులు, వాకింగ్ ట్రాక్, విశాలమైన రహదారులు, అంగన్‌వాడీ, స్కూలు తదితర సదు-పాయాలతో నిర్మించిన ఈ టిడ్కో భవనాలను ప్రారంభించిన అనంతరం లబ్దిదారుల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హైందవ సంప్రదాయ ప్రకారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం మరో ముస్లిం లబ్దిదారు నివాసంలోనూ ప్రార్థనలు నిర్వహించి నూతన గృహంలో అడుగుపెట్టారు. ఇంటి వెలుపల మహిళా లబ్దిదారు పేరిట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును కూడా ముఖ్యమంత్రి స్వయంగా తగిలించారు. ప్రతీ ఇంటిపైనా పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈమేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ సంస్థతో రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మరికొందరు లబ్దిదారులకు ఇళ్లకు సంబంధించిన స్వాధీన పత్రాలను ఇంటి తాళాలను అప్పగించారు. గతంలో పీఎంఏవై కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను కూడా గత పాలకులు దుర్వినియోగం చేశారని సీఎం ఆక్షేపించారు. గత ప్రభుత్వం రూ.816 కోట్ల మేర అప్పు పెట్టిందని.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు ప్రయత్నించిందన్నారు. పేదలు ఇళ్లు

- 2లో

## పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన హోంశాఖ మంత్రి అనిత






**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా రూరల్ పోలీసు స్టేషన్ ను రాష్ట్ర హోంశాఖ మంత్రివర్యులు మరియు విజయనగరం జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలను , స్టేషనులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషనులో సిబ్బంది వివరాలను మరియు స్టేషనులో జరుగుతున్న క్రైమ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శక్తి టీంలు ప్రతి స్కూలు మరియు కాలేజీలను సందర్శించి మహిళల మరియు పిల్లల భద్రత మరియు శక్తి యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మహిళలు మరియు పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిసరాలలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి జిల్లా కేంద్రంలో ఒక ప్రదేశంను గుర్తించి అక్కడకు తరలించాలని, తద్వారా పోలీసు స్టేషనులో ఖాళి స్థలం ఉంటుందని, దానిని వేరే అవసరాలకు వినియోగించుకోవచ్చునని పోలీసు అధికారులకు సూచించారు. పోలీసు స్టేషనులో జరుగుతున్న క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్ లో ఉండే రికార్డులను పరిశీలించి పోలీసు అధికారులకు కొన్ని సూచనలు చేసారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అదే విధంగా జిల్లాలో నేరాలు నియంత్రించుటకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, 1వ పట్టణ సిఐ చౌదరి, ఎస్ఐ అశోక్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

## ప్రకాశ రాజ్‌కు మాతృవియోగం... స్పందించిన పవన్ కల్యాణ్

**అమరావతి,కలంకౌంటర్ :** ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ మాతృమూర్తి సువర్ణలత మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మాతృవియోగంతో బాధపడుతున్న ప్రకాశ్ రాజ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పవన్ కల్యాణ్ ఒక సంతాప సందేశాన్ని పంచుకున్నారు. "ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారు కన్నుమూశారని తెలిసి చింతించాను. సువర్ణలత గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. మాతృ వియోగానికి లోనైన ప్రకాశ్ రాజ్ గారికి, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొన్నారు. సినిమా రంగంలో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన ప్రకాశ్ రాజ్ ఇంట్లో జరిగిన ఈ విషాద ఘటన పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

## నటుడు ప్రకాశ్ రాజ్ కు సానుభూతి తెలిపిన జగన్

**అమరావతి,కలంకౌంటర్ :** ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తల్లి సువర్ణలత (86) తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆమె మృతి పట్ల వైసీపీ అధినేత జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ప్రకాశ్ రాజ్, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని, మనోబలాన్ని ప్రసాదించాలని జగన్ ఆకాంక్షించారు. సువర్ణలత గారి ఆత్మకు శాంతి చేకూరాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాతృ వియోగం అనేది ఎవరూ పూడ్చలేని లోటని, ఈ కష్ట కాలంలో ప్రకాశ్ రాజ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.



# రాష్ట్రంలో గృహ ప్రవేశాల పండుగ

## రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన తనిఖీలు

- అధిక లోడ్ బస్సులపై కఠిన చర్యలు తప్పవు... మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**తాడేపల్లి,కలంకౌంటర్ :** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులు తీసుకెళ్తున్న, అధిక లోడ్‌తో నడుస్తున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు..నిన్న రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 976 బస్సులను తనిఖీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని 193 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని టోల్‌ప్లాజాలు, చెక్‌పో స్టులు కలిపి మొత్తం 16 పాయింట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి ఆదేశాలతో అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తున్నారని వెల్లడించారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై ఎటువంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## కూటమి ప్రభుత్వం లో పేదల కు సేవకులను గుర్తిస్తున్న అధికారులు


- సేవే మార్గం సేవే లక్ష్యం గా ముందుకు సాగుతున్న నిజామ్
- బాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ కు సేవా పురస్కారం



**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** నిజామ్ చేసిన సేవలకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు . గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన నిజామ్ లాభాపేక్ష లేకుండా సేవాపేక్ష ముఖ్యంగా ముందడుగు కూటమి పాలనలో అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతోంది అనేది ప్రతి ఒక్కరికి తెలిసిన అంశం. దీనిలో భాగంగా పేదలకు సేవ చేసిన వారిని గుర్తిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంది. చందోలు గ్రామానికి చెందిన గన్ పంతులు కుమారుడు, బాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ ఎన్నో సంవత్సరాల గా చేసిన సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీనికి అనుసంధానం గా ప్రభుత్వం రూపుదాల్చిన పి ఫోర్ పథకం ద్వారా కొన్ని కుటుంబాలను ఆయనకు దత్తత ఇచ్చారు. నిజామ్ చేసిన సేవలకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు. సేవే మార్గం సేవే లక్ష్యం గా ముందుకు సాగడం ఒక శుభపరిణామం అని ప్రశంసల వర్షం కురిపించారు. ప్రతి ఒక్కరు కూడా సేవ చేయటానికి నిజామ్ ని ఆదర్శంగా తీసుకోవాలి అని సూచించారు. నిజామ్ నైజం సేవకు మార్గం అంటూ అభినందనలు కురిపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆర్జీల పరిష్కారంలో నాణ్యత ముఖ్యం

- పారదర్శకంగా, జవాబుదారితనంతో అర్జీలను పరిష్కరించాలి..
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందే ఆర్జీలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చొరవ చూపాలన్నారు. ప్రతి ఆర్జీని అధికారులు వ్యక్తిగత సమస్యగా భావించి పరిష్కార మార్గం చూపాలన్నారు. పిజిఆర్ఎస్‌లో నమోదు అయ్యే ఆర్జీల పరిష్కారం పై గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

**98 అర్జీల నమోదు..** ఎంఏయుడి 24, పంచాయతీరాజ్ 11, పోలీస్ శాఖకు 10, మార్కెటింగ్ 6, డిఆర్‌డిఏ 5, రెవెన్యూ శాఖకు సంబంధించి 5, పౌరసరఫరాలు 5, విద్య 4, వ్యవసాయం 3, విద్యుత్ 3, ఉపాధి కల్పన 3, ఆర్‌డబ్ల్యుఎస్ 3, హెల్త్ 2, భూగర్భ గనులు 2, దేవాదాయ 2, మత్స్య 2, సర్వే, పరిశ్రమలు, జలవనరులు, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, డ్వామా, కార్మిక శాఖ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రోడ్లు మరియు భవనాల కు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 98 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.
















(మొదటిపేజీ తరువాయి)

కట్టుకోలేని పరిస్థితి కల్పించిందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు.

**సంక్షేమంలో మార్చినెల కొత్త రికార్డులు..** గడచిన 21 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని ..ఈ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ఆదాయం-వ్యయం ఎలా ఉన్నా... సంక్షేమానికి, అభివృద్ధికి మాత్రం లోటు లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్లకు ఇప్పటికి దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తల్లికి వందనం, దీపం 2, స్త్రీశక్తి సహా ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించామన్నారు. ఈ మార్చి నెల సంక్షేమంలో కొత్త రికార్డులు సృష్టించింది. వరాలను తెచ్చిందన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజు లక్ష మంది పారిశ్రామిక వేత్తలుగా ప్రకటించామని..ఈ ఏడాది 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని పెట్టుకున్నామని స్పష్టం చేశారు. రైతుకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులను విడుదల చేశామని.. 47 లక్షల మంది రైతులకు రూ. 2,676 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు. ఉగాది కానుకగా నిరుద్యోగ యువత కోసం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని అన్నారు. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌కు నెల్లూరు జిల్లాలో శంకుస్థాపన చేసుకున్నామని.. రక్షణ రంగంలో మన రాష్ట్రం కీలకం అవుతుందన్నారు. వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. 12.76 లక్షల మంది దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ఈ నెలలోనే కల్పించామని సీఎం తెలిపారు. ఉగాది రోజున 6,787 మంది పేదలకు రూ. 56 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదల చేశామన్నారు. రంజాన్ తోఫాగా ఇమామ్, మౌజన్లకు రూ. 45 కోట్ల గౌరవ వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులకు రూ.226 కోట్ల పునరావాస నిధులను విడుదల చేశామన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలకమైన ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని.. ఈ పరిశ్రమ ద్వారా రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, లక్ష ఉద్యోగాలు ఒకే ఒక్క పరిశ్రమతో మనకు దక్కాయన్నారు. గత ప్రభుత్వం చిన్న కాంట్రాక్టర్లకు నిలిపివేసిన రూ.2,000 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి 50 వేల కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువచ్చామని తెలిపారు. అంతకుమించి . 5 కోట్ల ప్రజల కలలు నెరవేర్చే ప్రజా రాజధానికి చట్టబద్దత కల్పించమని కేంద్రాన్ని కోరుతూ శాసన సభలో తీర్మానం చేశామన్నారు.

**2029 నాటికి 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం..** 2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మొత్తం 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. 2014-19లో 8.19 లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టి పేదలకు అప్పగించామని వివరించారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ అస్తవ్యస్తం చేశారని వాటన్నిటినీ గాడిలో పెడుతున్నామన్నారు. గత పాలకులు పేదవాళ్ల పొట్టకొట్టారని.. వారికి తీరని అన్యాయం చేశార్మని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 6.5 లక్షల ఇళ్లు మాత్రమే కడితే 21 నెలల్లోనే తాము 5.5 లక్షల ఇళ్లను కట్టి పేదవాళ్లకు అప్పగించామన్నారు. గత పాలకులు ప్రజావేదికతో విధ్వంసాన్ని మొదలు పెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రూ.10.50 లక్షల కోట్ల అప్పులు చేసి.. కేంద్రం ఇచ్చిన డబ్బులు కూడా మళ్లించారన్నారు. అవినీతి, అక్రమాలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీఎం ఆక్షేపించారు. ఇళ్ల కోసం లబ్దిదారులు కట్టిన రూ.174 కోట్లను కూడా వాడేసుకున్నారని అన్నారు. 22 వేల మంది లబ్దిదారులకు ఆ డబ్బులను తక్షణమే చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. 300 చదరపు అడుగుల ఇల్లు ఉచితమని, 350,400 చదరపు అడుగుల ఇళ్లు రాయితీపై ఇస్తామని ప్రగల్భాలు పలికి మోసం చేశారన్నారు. నివాస యోగ్యం కాని స్థలాలను ఇచ్చి ఇళ్లు కట్టించే ప్రయత్నం చేసి రూ.3,109 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని సీఎం వ్యాఖ్యానించారు. శ్మశానాల్లో, వాగుల్లో, బురద నేలల్లో స్థలాలు ఇచ్చి ఎవరికీ ఉపయోగపడకుండా చేశారన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ పేదలు మురికివాడలు కాకుండా పరిశుభ్రమైన ప్రాంతాల్లో ఉండాలన్న లక్ష్యంతో అన్ని సదుపాయాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్టు వివరించారు. విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టడానికి మీనమేషాలు లెక్కించారన్నారు.

**ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు..** అందరికీ ఇళ్లు కార్యక్రమం కింద రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇళ్లస్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి వివరించారు. భవిష్యత్తులో ప్రతీ ఇంటికీ పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. ఉచిత సిలెండర్ కు ఇచ్చే డబ్బులు ప్రతీ రెండు నెలలకూ వినియోగదారులకు చెల్లిస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని కూడా గత పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకం కొనసాగించేలా చేశామన్నారు. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన కూడా జరుగుతుందని.. మహిళలకూ చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే మహిళలకు టీడీపీ, ఎన్డీఏలు స్వాగతం పలుకుతాయన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతోనే అనునిత్యం పనిచేస్తున్నామని సీఎం వివరించారు. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు వచ్చేలా వ్యవస్థను గాడిలో పెట్టామన్నారు. పెన్షన్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పౌర సేవల అమలులో ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. పౌర సేవలు అందించటంలో చక్కగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నట్టు వివరించారు. సేవలు సరిగ్గా అందని చోట సరిచేసుకోవాలని సీఎం హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయాన్ని అనుసరించే పాలన మెరుగు పర్చుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఓటేసి కూటమికి అధికారం ఇచ్చారని.. కానీ ఒకాయన ప్రతిపక్ష హోదా ఇమ్మని అడుగుతున్నారని.. ఆ హోదా ఇచ్చేది ప్రజలే కానీ తాను కాదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ప్రజలకు మేలు చేయాలని కానీ విధ్వంసం చేయకూడదన్నారు. అలాంటి వారిని దూరం పెట్టాల్సిన అవసరముందన్నారు. 2028 నాటికి తాను రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తి అవుతుందని.. ఎలాంటి ఆరోపణలూ లేని తనపై కేసులు పెట్టి జైల్లో వేశారని ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని సీఎం ప్రశ్నించారు. ఇంకా కొందరు సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెట్టి ఆడబిడ్డలను రోడ్డుపైకి లాగుతున్నారని.. దీనిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యమంత్రి బాగా పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని గత పాలకుడు ఏపీని గంజాయికి, డ్రగ్స్ కు అడ్డాగా మార్చారన్నారు. కూటమి ప్రజాప్రభుత్వం అనునిత్యం రాష్ట్రంలో సంపద సృష్టికే ప్రయత్నిస్తోందన్నారు. సమర్ధవంతమైన నిర్వహణతో సంక్షేమం అభివృద్ధి సమతూకంగా చేపడుతున్నామన్నారు.


**మత్స్యకారులకు అండగా ప్రజాప్రభుత్వం..** అటానమస్ షిప్ యార్డు వల్ల స్థానిక మత్స్యకారులు ఎవరికీ అన్యాయం జరగదని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పొరుగు రాష్ట్రాల జాలర్లు మన జలాల్లోకి రానివ్వకుండా కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు తీరప్రాంతానికి ప్రత్యేకంగా రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నట్టు వివరించారు. పొరుగు రాష్ట్రాల జాలర్ల కారణంగా స్థానిక మత్స్యకారులకు ఎలాంటి నష్టం జరక్కుండా చూడాల్సిన బాధ్యతను తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి అప్పగించారు. తమిళనాడు, పాండిచ్చేరి నుంచి వచ్చిన జాలర్లు ఈ ప్రాంతంలో చేపల వేట చేసుకోడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అవసరం మేరకు మరో 4 బోట్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో జాలర్లకు ఇచ్చే భృతిని మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేలకు పెంచామని.. దీని కోసం 1.29 లక్షల మంది కుటుంబాల ఖాతాల్లో రూ.259 కోట్లు జమ చేశామన్నారు. ఇక మత్స్యకారుల పొట్టకొడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 217 జీవోను కూడా రద్దు చేసి స్థానిక నీటి వనరుల్లో జాలర్లకే వేట అనుమతిని పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, కొలుసు పార్ధసారధి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన తటవర్తి



**కర్నూలు,కలంకౌంటర్ :** రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గా నియమితులైనప్పటినుంచి ఆర్యవైశ్య మహాసభ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న తటవర్తి రమేష్. తటవర్తి రమేష్ విజయవాడ ఆర్య వైశ్య మహాసభ బిల్డింగ్ నిర్మాణ నిమిత్తం 25,00,000/-రూ .ప్రకటించి తన దాతృత్వం చాటు కొన్నాడు ఆర్యవైశ్యల సంక్షేమం కోసం పాటు పడుతాను అని తటవర్తి తెలిపారు

## పల్లపోతును ఘనంగా సన్మానించిన టిజి వెంకటేష్



**కర్నూలు,కలంకౌంటర్ :** ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ గా నియమితులైన ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ టిడిపి నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు గారిని మాజీ రాజ్యసభ సభ్యులు టి జి వెంకటేష్ గారు కూడా వాళ్లకు ఎప్పుడైనా కర్నూలు ఆర్యవైశ్య మహాసభ సర్వసభ్య సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

# పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం - మంత్రి కొల్లు రవీంద్ర









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు సోమవారం ఉదయం రాష్ట్ర మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తో కలసి రెండో విడతలో నగరంలోని రుద్రవరంలో 1089 మంది లబ్ధిదారులకు పీఎంఏవై... ఎన్టీఆర్ నగర్ టిడ్కో జి ప్లస్ త్రీ గృహాలను లాంఛనంగా ప్రారంభించి సంబంధిత పత్రాలను, నమూనా తాళం చెవులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇల్లు కట్టించి ఇవ్వాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. అందులో భాగంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండో విడతగా 2,50,893 గృహాలను లాంచనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. ఇది నిజంగా ఒక శుభదినం అని అన్నారు. ఆనాడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు వెంకయ్య నాయుడు సహకారంతో రాష్ట్రానికి 2లక్షల 50 వేల ఇల్లు మంజూరయ్యేలా కృషి చేశారన్నారు. మున్సిపల్ శాఖ మంత్రివర్యులు నారాయణ ప్రపంచంలోనే అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం షేర్వాల్ సాంకేతికతో ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అందులో భాగంగా మచిలీపట్నంలోని రుద్రవరంలో 6,400 ఇల్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించిన పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశామన్నారు. ఎన్నికల తర్వాత ఆ పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పేదవారికి ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. సొంతిల్లు లేక చాలామంది ఇబ్బందులు పడుతున్నట్లు తాము గమనించామన్నారు. ఆ ప్రకారం రుద్రవరంలో 1,440 ఇల్లు పూర్తి చేశామన్నారు ఇప్పటివరకు 1089 మంది రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని వారికి నేడు ఇళ్ల తాళాలు అప్పగిస్తున్నామన్నారు. కొన్ని పునాది స్థాయిలో ఆగిపోయాయని, ఇంకా 1,800 ఇల్లు నిర్మించి పేదవారికి త్వరలో అందజేస్తామన్నారు. ఈ టిడ్కో గృహాల సముదాయంలో మురుగునీటి వ్యవస్థను, సెప్టిక్ ట్యాంకును, అంగన్వాడీ పాఠశాలను, కమ్యూనిటీ హాలును, షాపింగ్ కాంప్లెక్స్ ను, ప్రహరీని ఏర్పాటు చేయడంతో పాటు భద్రత కోసం గార్డును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం సి ఎస్ ఆర్ నిధులను కూడా వినియోగిస్తున్నామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే లబ్ధిదారులు నేరుగా తనను సంప్రదించాలని కోరారు కొంతమంది లబ్ధిదారులు టిడ్కోగృహాల కోసం ఇదివరకు 20, నుంచి 30 వేల రూపాయలు చెల్లించారని, ఆ మొత్తాలను వారికి తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నామన్నారు. సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమ ఫలాలు విజయవంతం గా అందరికీ అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 64 లక్షల మంది లబ్ధిదారులకు సంవత్సరానికి 35 వేల కోట్ల రూపాయలు, నెలకు 2,700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు.తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ ల సరఫరా, అన్న క్యాంటీన్, గుంతలు లేని రహదారులు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమిని ఇళ్లస్థలాలుగా కేటాయిస్తామన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, అందులో భాగంగా ఇటీవల 1 లక్షా 50 కోట్ల రూపాయల వ్యయంతో ఆర్సెలర్ మిటల్ స్టీల్ ప్లాంట్ ను త్వరలో పూర్తి చేసుకుంటున్నామన్నారు బందరు ఓడరేవు నిర్మాణం 2026..27 సంవత్సరానికి పూర్తయి ఓడలు కూడా రానున్నాయన్నారు. తద్వారా ఓడరేవు ఆదారిత పరిశ్రమలు కూడా రానున్నాయని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి తినడానికి ఆహారము, కట్టుకోవడానికి దుస్తులు, ఉండటానికి ఇల్లు చాలా అవసరం అన్నారు. ఈ టిడ్కో జి ప్లస్ త్రీ ఇళ్లను ప్రభుత్వం ఎంతో నాణ్యతతో, అత్యాధునిక షేర్వాల్ సాంకేతిక తో నిర్మించిందన్నారు. పేదల జీవితాల్లో మార్పు దిశగా ఒక ఆస్తిన లభించినట్లు అయిందన్నారు టిడ్కో ఇళ్లలో మూడు రకాల కేటగిరీలు ఉన్నాయని, 300 చదరపు అడుగుల ఫ్లాట్ విలువ 6.55 లక్షల రూపాయలు కాగా ఆ మొత్తం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా భరిస్తూ ఉన్నాయన్నారు. లబ్ధిదారులకు కేవలం ఒక రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం జరుగుతుందన్నారు అదేవిధంగా 365 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి అయ్యే ఖర్చు 7 లక్ష 55 వేల రూపాయలలో 4.15 లక్షల రూపాయలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, లబ్ధిదారుని వాటా కింద 25 వేల రూపాయలు మిగిలిన 3.15 లక్షల రూపాయలను వాయిదాల రూపంలో బ్యాంకు రుణం చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే 430 చదరపు అడుగుల ఫ్లాట్ విలువ 8.55 లక్షల రూపాయలు అవుతుందని, 4.40 లక్షల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, లబ్ధిదారుడు తన వాటా కింద 50వేల రూపాయలు, 3.65 లక్షల రూపాయలు బ్యాంకు రుణం వాయిదాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకు నుండి పొందిన రుణం సకాలంలో తిరిగి చెల్లించాలని ఆలస్యం చేస్తే వడ్డీ పెరిగిపోతుందన్నారు. ముఖ్యంగా వాయిదా కంతుల కంటే కొంత ఎక్కువగానే పైకం చెల్లించినట్లయితే రాను రాను వడ్డీ తగ్గుతుందన్నారు.రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ప్రతి పేదవానికి శాశ్వత గృహం నిర్మించి ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఇందులో భాగంగా మచిలీపట్నంలో గతంలోనే 6 వేల గృహాల నిర్మాణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, మచిలీపట్నం నియోజకవర్గ ప్రత్యేక అధికారి మార్కెటింగ్ ఏడి నిత్యానందం, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గృహ నిర్మాణ సంస్థ ఈఈ బుచ్చిబాబు, మునిసిపల్ డి ఈ నాగరాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ , మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, , మాజీ కార్పొరేటర్ సమతాకీర్తి, స్థానిక నాయకులు వెంకటస్వామి, రమేషు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి టీజీ సంస్థల నుంచి కోటి రూపాయలు విరాళం





**కర్నూలు,కలంకౌంటర్ :** విజయవాడ లో నిర్మిస్తున్న నూతన ఆర్యవైశ్య మహాసభ భవనానికి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు వాణిజ్యం ఆహార శుద్ధి శాఖామంత్రి టీజీ భరత్ టీజీవి సంస్థల నుంచి 50 లక్షలు చెక్కులు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్యకి అందజేసారు.గతంలో కూడా ఈ భవన నిర్మాణానికి 50 లక్షలు ఇచ్చారు మొత్తం కోటి రూపాయలు ఈ భవన నిర్మాణానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ దోమ జగదీష్ ఇల్లూరు తిరుపాల్ బాబు గారు తెలుగుదేశం నాయకులు సోమిశెట్టి నవీన్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శేషగిరి శెట్టి ఆర్యవైశ్య సంఘ నాయకులు నాగిళ్ల రాజగోపాల్ ఇల్లూరు సుధాకర్ వాయిగండ్ల సుబ్బారావు విట్టల్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్






**బాపట్ల,కలంకౌంటర్ :** ఫిర్యాదిదారుల అర్జీలను సంతృప్తికర రీతిలో చట్టపరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన మోసాలు తదితర పలు సమస్యలను ఫిర్యాదిదారులు స్వేచ్ఛగా విన్నవించుకున్నారు. అర్జీలను చట్టపరిధిలో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ గభరోసా కల్పించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అర్జీలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే అర్జీలను సంతృప్తికర రీతిలో చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపవలెనని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 35 అర్జీలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, ఎస్.సి ఎస్.టి సెల్ ఇన్స్పెక్టర్ బాలనాగిరెడ్డి, పిజిఆర్ఎస్ సెల్ ఎస్.ఐ లక్ష్మీరాజ్యం, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మంచిరోజులు-- ఎమ్మెల్యే ఇంటూరి

## -పంచాయతీలకు దండిగా నిధులు - జోరుగా అభివృద్ధి



**కందుకూరు, కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉన్న సుదీర్ఘ అనుభవమే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఉలవపాడు మండలం ఆత్మకూరు పంచాయతీలో 43.3 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఆత్మకూరులో 4 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లు, 4.5 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు, 21.8 లక్షల ఉపాధి పథకం నిధులతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు కుమ్మరిపాలెంలో 13 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. సర్పంచ్ నాళం గోవిందమ్మ నారాయణరావు దంపతులు, పంచాయతీ సభ్యులు, టిడిపి నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ..జగన్ పరిపాలనలో పంచాయతీల్లో చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేని పరిస్థితిని చూశామన్నారు.ప్రస్తుతం బెంగళూరులో తలదాచుకోవడం, అప్పుడప్పుడు విజయవాడ వచ్చి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రభుత్వంపై బురదచల్లి వెళ్లిపోవడం తప్ప జగన్ వల్ల ఉపయోగమేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు విడతల వారీగా డబ్బులు ఇస్తోందని, ఈ 20 నెలల్లో పల్లెల్లో ఎంతో అభివృద్ధి కనిపించిందని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాళం గోవిందమ్మ, టిడిపి నేత నాళం నారాయణరావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు కొల్లి అవినాష్, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహ కార్యదర్శి మద్దసాని మహేంద్ర, మాజీ సర్పంచ్ అమర్నేని రాములు, క్లస్టర్ ఇంచార్జి బెల్లం కృష్ణమోహన్, టిడిపి నేతలు బండి వెంకటసుబ్బయ్య, దేవినేని అవినాష్, కొల్లి శ్రీను, దేవినేని శ్రీనివాసులు, మండలంలోని టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన పాత కేసుల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. 2011లో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు తాము శాంతియుతంగా నిరసన తెలిపామని, అయితే అప్పటి ప్రభుత్వం రాజకీయ కారణాలతో తమపై అక్రమ కేసులు నమోదు చేసిందని నిందితుల తరపు న్యాయ-ువాదులు కోర్టుకు విన్నవించారు. దశాబ్ద కాలం గడిచినా ఈ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తక్షణమే కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై పూర్తి వివరాలతో కూడిన 'కౌంటర్' దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పటి ఘటనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు, ప్రస్తుత కేసు స్థితిగతులను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

# పేదవారి సొంతింటి కల తప్పక నెరవేరుస్తా - ఎమ్ ఎల్ ఏ ఇంటూరి

## -త్వరలో 6 వేల పక్కాఇళ్లు మంజూరు



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు లుంబినీవనంలో సామూహిక గృహ ప్రవేశాలు సోమవారం జరిగాయి. ఈ గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు తో కలసిసబ్ కలెక్టర్ హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే అనూష హాజరయ్యారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష, కేంద్ర ప్రభుత్వం 1.5 లక్షల రూపాయలు చొప్పున మొత్తం 2.5 లక్షలు మంజూరు చేసింది. నూతన గృహప్రవేశ దారులకు ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక, అర్బన్ పరిధిలో 410 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మండలాల పరిధిలో 6 వేల ఇళ్లకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరు ఉత్తర్వులు వస్తాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. రాబోయే మూడేళ్లలో పెద్ద సంఖ్యలో పక్కాఇళ్లు నిర్మించి, లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఈఈ మాధవరావు, డిఈ నారాయణ, ఏఈలు సుబ్బారావు, నాగరాజు, బాషా, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టీజీ వెంకటేష్ ఆశీస్సులు





కర్నూలు,కలంకౌంటర్ : మాజీ మంత్రి శ్రీ టీజీ వెంకటేష్ కి కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన ఉగాది తెలుగు పంచాంగం అందజేసి ఆశీస్సులు తీసుకున్న కలం కౌంటర్ దినపత్రిక ప్రకాశం జిల్లా ఇంచార్జి చక్కా కేశవరావు.



రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కు కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన ఉగాది తెలుగు పంచాంగం అందజేసిన ప్రకాశం జిల్లా ఇంచార్జి చక్కా కేశవరావు. చిత్రంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్య,వివిధ జిల్లాల నాయకులు ఉన్నారు.

–కర్నూలు,కలంకౌంటర్ :

## క్రేన్ సంస్థలు అధినేతకు ఉగాది పంచాంగం



గుంటూరు,కలంకౌంటర్ : క్రేన్ సంస్థలు అధినేత గ్రంథి కాంతారావు కి కలం కౌంటర్ దినపత్రిక ఉగాది పంచాంగం అందజేసిన దృశ్యం. చిత్రంలో ప్రముఖులు వైభవ్ నాగేశ్వరావు ఉన్నారు.

## ఉగాది పంచాంగాలు పంపిణీ



పెడన,కలంకౌంటర్ : కలంకౌంటర్ దినపత్రిక ప్రచురించిన ఉగాది తెలుగు పంచాంగం పుస్తకాలను ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి ఆవిష్కరించి పెడన ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు కార్యదర్శి సమయమంత్రి కుమార్ సభ్యులు కార్యవర్గ సభ్యులు పాదర్తి కోటేశ్వరరావు కొల్లిపర పవన్ కుమార్ సభ్యులు పెనుకొండ మామిల్లయ్య తాడిపర్తి సునీల్ శ్రీ వాసవి మహిళా మండలి సభ్యురాలు ఆత్మకూరి పద్మావతి కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ గుప్త తదితర ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు అందజేసిన ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి.

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

### –మాజీ మంత్రి టీజీ వెంకటేష్































**కర్నూలు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఏ ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని మాజీ రాజ్యసభ సభ్యులు, ఆర్యవైశ్య పెద్ద టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలులో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య మహాసభ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ నూతనంగా ఎన్నికైన ఇల్లూరి లక్ష్మయ్యకు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులుగా ఇల్లూరు లక్ష్మయ్య ఎన్నిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. గతంలో గాడి తప్పిన ఆర్యవైశ్య మహాసభను గాడిలో పెట్టి చిన్ని రామ సత్యనారాయణ అధ్యక్షునిగా నియమించానని, ఆయన సమర్థవంతంగా తన బాధ్యతను నిర్వహించాడని, అదేవిధంగా ఇల్లూరు లక్ష్మయ్య కూడా ఆర్యవైశ్యులకు సేవలందిస్తూ సమర్థవంతంగా అధ్యక్ష పదవిని నిర్వహించాలని సూచించారు. విజయవాడలో ఆర్యవైశ్య మహాసభ బిల్డింగును త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఆర్యవైశ్యులకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు టీజీ భరోసా ఇచ్చారు. ఆర్యవైశ్యులకు సంబంధించిన ఆస్తుల ను ఎవరు కాజేయాలని చూసినా వారిని ఉపేక్షించబోనని

తెలిపారు. మహాసభ నూతన భవనానికి విరాళాలు అందజేసిన వారిని ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి తాను శక్తివంతం లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తాను అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన తన గురువు టీజీ వెంకటేష్ కు, రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఆర్యవైశ్యులకి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు ఆర్యవైశ్య పెద్దల సహకారంతో సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, ఆర్యవైశ్య మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బరాయుడు, మహిళా అధ్యక్షురాలు కొప్పురావూరు రజిని, శబరి వరప్రసాద్, మహాసభ రాష్ట్ర మాజీ కార్యదర్శి తటవర్తి రమేష్, మహాసభ రాష్ట్ర నాయకుడు కనమర్లపూడి సురేష్, ముడియం రమణ,ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్, వెంట్రప్రగడ వీరాంజనేయులు, వేముల శ్రీనివాస్,చక్కా చెన్నకేశవరావు,ఆర్యవైశ్య మహాసభ నాయకులు, వివిధ జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com